ఆంధ్రజ్యోతి

andhrajyothy.com ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.1 ; కనిష్ఠం 23.9



నిజామాబాద్
జిల్లా వార్తలు

సోమవారం 2 సెప్టెంబరు 2024

నేడు విద్యా సంస్థలకు సెలవు

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 1: భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థలకు సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని విద్యాసంస్థలు విధిగా ఈ ఆదేశాలను పాటించాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో సెలవు ప్రకటించినట్లు ఆయన తెలిపారు.



• తడపాకల్ గోదావరి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



• ఉధృతంగా పారుతున్న మంచిప్ప చెరువు అలుగు

ముంచెత్తిన వాన



• ఉప్పొంగి పారుతున్న రాళ్లవాగు

- జిల్లా వ్యాప్తంగా పొంగిపొర్లుతున్న చెరువులు, వాగులు
- లోతట్టు ప్రాంతాలు జలమయం.. ఇళ్ల చుట్టూ చేరిన నీరు
- అత్యధికంగా ధర్పల్లి మండలంలో 174.5 మిల్లీ మీటర్ల వర్షం
- సహాయక చర్యల కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- జిల్లాలో మరో మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం



• అలుగు పారుతున్న మోర్తాడ్ ముసలమ్మ చెరువు

ఆంధ్రజ్యోతి, నిజామాబాద్/ న్యూస్ నెట్‌వర్క్, సెప్టెంబరు 1: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనతో జిల్లాను వర్షం ముంచెత్తింది. భారీ వర్షం పడటంతో వాగులు ఉప్పొంగాయి, చెరువులు పొంగిపొర్లాయి. పంట చేనులు నీటమునిగాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలుచోట్ల రోడ్లపై ఉన్న కాజ్‌వేలు పొంగిపొర్లాయి. పలు ప్రాంతాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. చిన్నవాగులు నుంచి పెద్ద వాగుల వరకు వర్షానికి వరద పెరిగింది. ఎడతెరపి లేని వర్షంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. మరో మూడు రోజుల పాటు భారీ వర్షాలు పడే అవకాశం ఉండటంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. భారీ వర్షాలకు జిల్లాలోని పలు గ్రామాల పరిధిలో 16 పాత ఇళ్లు నేలమట్టం కాగా కొన్ని చోట్ల రోడ్లు దెబ్బతిన్నాయి. గోదావరికి కూడా వరద పెరగడంతో పరీవాహక ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. వరద పెరుగుతుండటంతో పోలీసు, ఫైర్ శాఖలకు సంబంధించిన ప్రత్యేక సిబ్బందిని కూడా సహాయ చర్యల కోసం అందుబాటులో ఉంచారు.

నగర పరిధిలో రోడ్లన్నీ జలమయం

నిజామాబాద్ నగరం పరిధిలో భారీ వర్షంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. పలు ప్రాంతాల్లో రోడ్లు చెరువులను తలపించాయి. పూలాంగ్‌తో పాటు ఇతర నాలాలు పొంగిపొర్లాయి. రోడ్లపై నీళ్లు చేరడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల భారీగా వరద నిలిచిపోవడంతో పోలీసులు, కార్పొరేషన్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టి అటు వైపు ప్రజలు వెళ్లకుండా చూశారు. మరో మూడు రోజుల పాటు వర్షాలు ఉండటంతో కార్పొరేషన్ పరిధిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు నగర మున్సిపల్ కమిషనర్ మంద మకరంద్ సమీక్షిస్తూ చర్యలు చేపడుతున్నారు. బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీల్లో కూడా ఇదే రీతిలో అధికారులు చర్యలను చేపట్టారు.

అలుగు పారుతున్న 359 చెరువులు

జిల్లాలో కురుస్తున్న వర్షాలతో వాగులు పొంగుతుండగా చెరువులు నిండుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 996 చెరువులు ఉన్నాయి. వీటిలో ఇప్పటి వరకు ఈ వర్షాలతో 359 చెరువులు నిండి అలుగులు పారుతున్నాయి. జిల్లాలో 586 చెరువులు నిండుకుండలా మారగా 112 చెరువుల్లోకి 75 శాతంలోపు నీళ్లు చేరాయి. ఈ వర్షం ఇలాగే కొనసాగితే 24 గంటల్లో అన్ని చెరువులు నిండటంతో పాటు అలుగులు పారే అవకాశం ఉందని సాగునీటి శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

పోటెత్తిన కందకుర్తి

జిల్లాలో వర్షాలు పెద్ద ఎత్తున పడుతుండటంతో గోదావరి కూడా వరద పెరుగుతోంది. కందకుర్తి వద్ద వరద పోటెత్తుతోంది. మహారాష్ట్రతో పాటు నిర్మల్ జిల్లా నుంచి కూడా వరద వస్తుండటంతో నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. మంజీరా నుంచి కూడా వరద కందకుర్తి వద్ద గోదావరిలో కలుస్తుండటం వల్ల అధికారులు కూడా అప్రమత్తం అవుతున్నారు. ఎగువన మహారాష్ట్రలోని ప్రాజెక్టు గేట్లను ఎత్తడం వల్ల మరింత వరద పెరిగే అవకాశం ఉండటంతో గోదావరి పరీవాహక ప్రాంతాల గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. గోదావరి నదికి రెండు వైపులా ఉన్న గ్రామాల వారు ఆవైపు వెళ్లవద్దని కోరారు. పశువులను కూడా గోదావరి వైపు వదలవద్దని ఆదేశాలు ఇచ్చారు. రెవెన్యూ అధికారులు ఇప్పటికే ఆయా గ్రామాల పరిధిలోని పంచాయతీ కార్యదర్శుల ను అప్రమత్తం చేశారు.



• సిరికొండలో దోన్నవాగు ఉధృతికి నీట మునిగిన వరి పంట



• న్యాల్‌కల్‌లో రోడ్డుపై చేరిన వర్షపు నీరు

జిల్లాలో 61.6 మి.మీటర్ల వర్షం

జిల్లాలో సరాసరి సగటు వర్షపాతం 61.6 మిల్లీమీటర్లు నమోదు అయింది. జూన్ నుంచి ఇప్పటి వరకు 697.3 మిల్లీమీటర్ల వర్షం పడాల్సి ఉండగా 761.6 మిల్లీమీటర్ల వర్షం పడింది. జిల్లాలో అత్యధికంగా ధర్పల్లి మండలంలో 174.5 మిల్లీమీటర్ల వర్షం పడింది. సిరికొండ మండలంలో 125.0 మిల్లీమీటర్ల వర్షం పడగా, వర్ని మండలంలో 123.8 మిల్లీమీటర్ల వర్షం పడింది. మరో మూడు రోజుల పాటు జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షం పడుతుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.



• పొంగిపొర్లుతున్న కప్పలవాగు చెక్‌డ్యాం



• కందకుర్తి బ్రిడ్జి వద్ద వరద ప్రవాహం ఇలా..



• ధర్పల్లిలో పొంగిపొర్లుతున్న రామడుగు ప్రాజెక్టు

ఎస్సారెస్పీకి 60,419 క్యూసెక్కుల వరద

- మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో పెరుగుతున్న వరద
- నిండుకుండలా దర్శనమిస్తున్న ప్రాజెక్టు

నిజామాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు క్రమంగా వరద పెరుగుతోంది. ప్రాజెక్టులోకి ప్రస్తుతం 60,419 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులకు గాను 1086.3 అడుగులకు చేరింది. ప్రాజెక్టులో పూర్తిస్థాయి కెపాసిటీ 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 64.36 టీఎంసీలకు నీళ్లు చేరాయి. మహారాష్ట్రలో భారీ వర్షాలు పడుతుండటంతో నాందేడ్ జిల్లాలో ఉన్న విష్ణుపురి, అందూరా, బాలేగామ్ ప్రాజెక్టుల గేట్లను ఎత్తి 55వేల క్యూసెక్కుల నీటిని ప్రాజెక్టులోకి వదులుతున్నారు. నిర్మల్ జిల్లాలోని గడ్డెన్న వాగు ప్రాజెక్టు నుంచి కూడా 15వేల క్యూసెక్కుల నీరు కూడా ప్రాజెక్టులోకి వచ్చిచేరుతోంది. గోదావరి, మంజీరా వరద వల్ల ప్రాజెక్టులోకి ఎక్కువ మొత్తంలో నీళ్లు వచ్చే అవకాశం ఉండటంతో ముందస్తుగా ప్రాజెక్టు వరద కాలువ గేట్లను ఎత్తి మిడ్‌మానేరుకు నీటిని విడుదల చేశారు. మొదట 1500 క్యూసెక్కుల నీటిని కాలువలోకి వదిలిన అధికారులు వరద పెరిగిన తర్వాత 15వేల వరకు విడుదల చేసేందుకు నిర్ణయించారు.



ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

• కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 1: జిల్లాలో వర్షాలకు ప్రజలు ఇబ్బందులు పడకుండా అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. కలెక్టరేట్‌తో పాటు మున్సిపాలిటీలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తున్నామని ఆయన తెలిపారు. అధికారులు ఉద్యోగులను ఆయా హెడ్‌క్వార్టర్‌లోనే ఉండాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. ఈ భారీ వర్షాలకు వరదలు పెరగడం, వాగులు పొంగుతుండటం, చెరువులు మత్తడి పడుతుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

కంట్రోల్ రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్

భారీ వర్షాల నేపథ్యంలో తక్షణ సహాయ చర్యలు చేపట్టేందుకు వీలుగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆదివారం పరిశీలించారు. కంట్రోల్ రూమ్ ద్వారా స్వీకరిస్తున్న ఫిర్యాదుల విధానాన్ని, సంబంధిత అధికారులకు సమాచారం తెలియజేస్తూ అప్రమత్తం చేస్తున్న తీరును పరిశీలించారు. ఇప్పటి వరకు ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి, వాటిని ఎవరికి తెలియజేశారు, తదితర వివరాలను కంట్రోల్ రూమ్‌లో ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న సమాచార పౌరసంబంధాల శాఖ టైపిస్ట్ ఫైమద్ పాషాను అడిగి తెలుసుకున్నారు. వర్షాల వల్ల జిల్లాలో ఎక్కడైనా ఇబ్బందులు నెలకొంటే ప్రజలు ఏ క్షణంలోనైనా కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ 08462-220183 నెంబర్‌కు సమాచారం అందించాలన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, ఏవో ప్రశాంత్, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం



వీసీలో పాల్గొన్న కలెక్టర్, సీపీ, ఇతర అధికారులు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- వర్ష ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించాలి
- ముందస్తు చర్యలు చేపట్టాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 1: రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అంతటా అప్రమత్తంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. ఆదివారం డీజీపీ జితేందర్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ఆయా జిల్లాల కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో వరద ప్రభావిత ప్రాంతాల పరిస్థితులను సమీక్షించారు. ఒక్కో జిల్లా వారీగా ప్రస్తుతం నెలకొని ఉన్న పరిస్థితిని అడిగి తెలుసుకుంటూ చేపడుతున్న సహాయ చర్యల గురించి ఆరా తీశారు. మరో రెండు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఎక్కడ కూడా ప్రాణనష్టం సంభవించకుండా అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగానే అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడైనా ప్రజలు జల దిగ్బంధంలో చిక్కుకుంటే తక్షణ సహాయ చర్యలు చేపట్టాలని అవసరమైన పక్షంలో సహాయక బృందాలను పంపిస్తామన్నారు. అయితే ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు వచ్చే వరకు వేచి చూడకుండా పోలీసులు, ఫైర్ సిబ్బంది సేవలను వినియోగిస్తూ ప్రాణనష్టం జరుగకుండా చూడాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 26 ప్లటూన్ల పోలీసు బలగాలు అందుబాటులో ఉన్నాయని సూచించారు. చేపల వేటకు, ఈత సరదా కోసం చెరువులు, కుంటలు, రిజర్వాయర్‌లకు ఎవరూ వెళ్లకుండా పోలీసు, రెవెన్యూ సిబ్బందిచే నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుత సమయంలో అధికారులు ఎవరూ కూడా సెలవుల్లో వెళ్లకుండా పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వహించేలా చూడాలన్నారు. వర్ష ప్రభావిత జిల్లాల్లో పాఠశాలలకు సెలవులు ప్రకటించామని కలెక్టర్లను ఆదేశించారు. తాగునీరు కలుషితం కాకుండా పర్యవేక్షణ చేయాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా చూడాలన్నారు. ఎక్కడ కూడా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగం సమర్థవంతంగా పనిచేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, అదనపు డీసీపీ కోటేశ్వర్‌రావు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కాసాని వీరేష్

'ముదిరాజ్‌లను బీసీ-డీ జాబితా నుంచి బీసీ-ఏలోకి మార్చాలి'

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 1: ముదిరాజ్‌లను బీసీ-డీ జాబితా నుంచి బీసీ-ఏలోకి మార్చాలని, అప్పుడు ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతారని ముదిరాజ్ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి కాసాని వీరేష్ ముదిరాజ్ అన్నారు. ఆదివారం నగరంలోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ జిల్లా మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా అధ్యక్షుడు కరాటే రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్‌లంతా ఏకమై జిల్లా మహాసభను నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ముదిరాజ్‌లంతా ఐక్యంగా ఉండి రాబోయే ఎన్నికల్లో సర్పంచులుగా, ఎంపీటీసీలుగా, జడ్పీటీసీలుగా గెలుపొందే విధంగా కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలుగా రానున్న రోజుల్లో ముదిరాజ్‌లే రాజకీయ పాలన చేయాలని, ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో ఎదగాలన్నారు. పార్టీలకు అతీతంగా ముదిరాజ్‌లంతా ఏకం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్‌ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి రాజారాం, వినోద్, జక్కం అశోక్ పాల్గొన్నారు.

మంచిప్ప చెరువులో భారీ చేప లభ్యం

మోపాల్, సెప్టెంబరు 1: మండలంలోని మంచిప్ప చెరువులో మత్స్యకారులకు భారీ చేప లభించింది. ఆదివారం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి చెరువు అలుగు పారింది. మత్స్యకారులు వలలు వేయడంతో అందులో 20కిలోలకు పైగా బరువు ఉన్న రవాట చేప లభ్యమైంది. దీంతో మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేశారు. గతంలో ఎప్పుడు ఇంత పెద్ద చేప లభించలేదని ఇదే మొదటిసారి అని వారు సంతోషం వ్యక్తం చేశారు.


భారీ చేపతో మత్స్యకారులు

అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 1: సెప్టెంబరు 1 పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా బీసీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని పూలాంగ్ చౌరస్తాలోగల అంబేద్కర్ విగ్రహానికి సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. సీపీఎస్ విధానం ఉద్యోగుల పాలిట శాపంగా మారిందని పదవీ విరమణ తర్వాత ఉద్యోగి కుటుంబం రోడ్డుపైకి వచ్చే పరిస్థితి ఉందన్నారు. అనేక రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించారని తెలిపారు. అదేవిధంగా మన రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో సీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తామని ఇచ్చిన హామీ మేరకు తక్షణమే ఆ విధానాన్ని రద్దు చేసి ఉద్యోగ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయ్‌కుమార్, శంకర్, సంజీవ్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎడ్ల పొలాల అమావాస్య


నగరంలో మట్టి ఎడ్లను కొనుగోలు చేస్తున్న దృశ్యం


నాళేశ్వర్‌లో పొలాల అమావాస్య నిర్వహిస్తున్న దృశ్యం

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 1: సంతానాన్ని, ఆయుష్షుని అందించే వ్రతంగా ఎడ్ల పొలాల అమావాస్యను జరుపుకుంటారు. జిల్లా వ్యాప్తంగా సోమవారం ఎడ్ల పొలాల అమావాస్యను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. రైతులు వ్యవసాయంలో తమకు దన్నుగా నిలిచిన ఎడ్లను నీటితో స్నానం ఆచరించి కొత్త వస్త్రాలను, వివిధ ఆభరణాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఇలా ఎడ్లను పూజించడం వల్ల వ్యవసాయ క్షేత్రాల్లో ఎలాగైతే పరినాట్లు ఎదుగుతాయో అదే విధంగా తమ సంతానం వృద్ధి చెందుతుందని భావిస్తారు. ఎడ్ల పొలాల అమావాస్య రోజున ఊర్లలో ముస్తాబు చేసిన ఎడ్లను గ్రామం అంతా ఊరేగించడం ప్రత్యేకతగా నిలుస్తుంది. ఎడ్లు లేని వారు మట్టితో తయారు చేసిన ఎడ్లను పూజిస్తారు. శ్రావణమాసం మంగళగౌరీవ్రతం నిర్వహించడంతో పాటు సంతాన ఆయుష్షును అందించే ఎడ్ల పొలాల అమావాస్య రోజు వ్రతాన్ని మహిళలు నిర్వహిస్తారు. ఈ అమావాస్య రోజు పూజించిన ఎడ్లను వినాయక చవితి వరకు ఉంచి ప్రతీరోజూ ప్రత్యేక పూజలు జరుపుతారు.

● మార్కెట్ సందడి

ఎడ్ల పొలాల అమావాస్యను పురస్కరించుకొని ఎడ్లను అలంకరించడానికి కావాల్సిన సామాగ్రి కొనుగోళ్లతో మార్కెట్ సందడిగా మారింది. ఉదయం నుండి వర్షం పడుతుండటంతో కొంత అసౌకర్యానికి గురైనప్పటికి వర్షం తగ్గగానే పూజకు కావాల్సిన సామాగ్రిని కొనుగోలు చేయడానికి ప్రజలు ఆసక్తి చూపారు. ఎడ్లులేని వారు ఇండ్లలో పూజించడానికి కావాల్సిన మట్టి ఎడ్లను కొనుగోలు చేశారు.

● నాళేశ్వర్‌లో ఎడ్ల పొలాల అమావాస్య

నవీపేట: మండలంలోని నాళేశ్వర్‌లో ఆదివారం సాయంత్రం పొలాల అమావాస్య ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా రైతులు తమ ఎద్దులను అందంగా అలంకరించి ముస్తాబు చేశారు.అనంతరం స్థానిక హనుమాన్ మందిరం చుట్టు ప్రదక్షిణ చేయించారు.పాడిపంటలు చల్లగా ఉండాలని మొక్కులు చెల్లించుకున్నారు.ఈకార్యక్రమంలో పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.

● ఘనంగా పొలాల అమావాస్య వేడుకలు

రెంజల్: మండలంలో పొలాల అమావాస్య వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాడిపంటలు చల్లగా ఉండేందుకు ప్రకృతి పూజించేలా మండలంలో అన్ని గ్రామాలలో ఘనంగా నిర్వహించారు. పశువులను శుభ్రపరిచి పశువులను అలంకరించారు. గ్రామంలో ఉన్న ఆలయం వద్ద ప్రదక్షిణలు నిర్వహించి పండుగను ఘనంగా నిర్వహించారు.

భార్యను హత్యచేసిన వ్యక్తి రిమాండ్


నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న సీఐ మల్లేశ్

డిచ్‌పల్లి,సెప్టెంబరు 1: డిచ్‌పల్లి మండల కేంద్రంలో ఈ నెల 29న రాథోడ్ విజయను భర్త అయిన గబ్బర్ సింగ్ చితకబాది చున్నీతో గొంతుకు కట్టి ఫ్యాన్‌కు వేలాడదీసి ఆత్మహత్యగా చిత్రీకరించిన గబ్బర్ సింగ్‌ను పోలీసులు అరెస్టు చేసి ఆదివారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మల్లేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. గబ్బర్ సింగ్‌కు తన భార్య విజయ వేరే వాళ్లతో ఫోన్‌లో మాట్లాడుతున్నదని అనుమానం పెంచుకొని భార్యను హత్య చేసినట్లు విచారణ ఒప్పుకున్నడని డిచ్‌పల్లి సీఐ తెలిపారు. కాగ మృతురాలిది సదాశివనగర్ మండలం యాచారం అని వెస్లీనగర్ తండాకు చెందిన గబ్బర్ సింగ్‌తో 2016లో రెండో వివాహం అయిందని సీఐ పేర్కొన్నారు.

బూత్ స్థాయి కార్యక్రమాలను విజయవంతం చేయాలి

పెద్దబజార్, సెప్టెంబరు 1:నెలరోజుల పాటు కొనసాగుతున్న సభ్యత్వ నమోదులో బూత్ స్థాయి కార్యకర్త నుంచి నాయకుల వరకు పాల్గొని విజయవంతం చేయాలని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్నాటి కార్తిక్ అన్నారు. ఆదివారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సోమవారం పార్టీ సభ్యత్వ నమోదు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రతీ ఒక్కరు పాల్గొనాలని అన్నారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. అతిపెద్ద పార్టీగా అత్యధిక సభ్యత్వం గల బీజేపీకి ప్రజల్లో మంచి ఆదరణ ఉందన్నారు. పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో సభ్యత్వ నమోదును పకడ్బందీగా నిర్వహించాలన్నారు. రాష్ట్రంలోనే జిల్లాను సభ్యత్వ నమోదులో ముందుంచాలని పిలుపునిచ్చారు.

పడిగెలలో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


పడిగెల పాఠశాలలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

వేల్పూర్, సెప్టెంబరు 1: మండలంలోని పడిగెల గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2011-12 విద్యసంవత్సరం పదోతరగతి చదివిన పూర్వవిద్యార్థులు గత 12ఏళ్ల తర్వాత ఒక చోట చేరి గెట్టుగేదర్ కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఆయాప్రాంతాల్లో వివిధ వృత్తులు, వ్యాపారులు, ఉద్యోగులుగా స్థిరపడిన పూర్వవిద్యార్థులు ఆదివారం మండల కేంద్రంలోని అనిల్ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా అనాటి విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను శాలువ, మెమోంటోలతో ఘనంగా సన్మానించారు.అనాటి తరగతి గదుల్లో చిలిపి చేష్టలు, అలర్లు, వివిధ సబ్జెక్టులపై బోధించిన వేసుకున్న జోక్‌లు, ఇతర మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ కుటుంబసభ్యులతో కలిసి ఉల్లాసంగా ఆత్మీయంగా ఘనంగా జరుపుకున్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్‌రావు, అశోక్, లింబాద్రి, గంగాధర్, లక్ష్మీనారాయణ, గంగామోహన్, గంగనర్సయ్య, రాజేందర్‌గౌడ్, పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

వర్షంలోనూ కొనసాగిన పెన్షన్ విద్రోహ దినం ధర్నా



నగరంలో ధర్న చేస్తున్న ఉద్యోగ జేఏసీ నాయకులు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 1: పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పెన్షన్ విద్రోహదినం వర్షంలోను కొనసాగింది. ఆదివారం ఉద్యోగ జేఏసీ చైర్మన్ అలుక కిషన్ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. భారీ వర్షం కురవడంతో ధర్నాని పాత కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ ధర్నాకు వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు అలుక కిషన్ మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసి ఉద్యోగులకు ఐటీ సీలింగ్‌పై రూ.10లక్షలు పెంచాలని డిమాండ్ చేశారు. ఓల్డ్‌పెన్షన్ రద్దు అయి కొత్త పెన్షన్ అమలు చేయడంతో ఉద్యోగుల భవిష్యత్తు అందకారంగా మారిందన్నారు. కొంత మంది ఉద్యోగులు మరణించినప్పటికీ సరైన విధివిధానాలు లేనందున ఎటువంటి పెన్షన్ రాక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని అన్నారు. సీపీఎస్ అంతమయ్యే వరకు పోరాటం ఆగదని పాతపెన్షన్ విధానం అమలయ్యే వరకు ఉద్యమిస్తామన్నారు.త్వరలో కమిటీని వేసి ఉద్యమకార్యచరణ ప్రకటిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో టిజివో అధ్యక్ష, కార్యదర్శులు అమృత్‌కుమార్, హన్మంత్‌రెడ్డి, ప్రశాంత్, వివిధ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రమేష్, సత్యనారాయణ, పండరినాథ్, భోజాగౌడ్, శాంతన్, అన్వర్, స్వామిదాస్, పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

కోటగిరి,సెప్టెంబర్1: భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తుండడంతో వ్యాధులు పెద్ద ఎత్తున ప్రబలే అవకాశం ఉందని, వ్యాధులు ప్రబలకుండా వైద్యశాఖ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. కోటగిరి మండల కేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నందున ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, నర్సులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రేషన్ కార్డులు ఉన్న వారికి ఈ నెల 30వ తేదీ వరకు ఈకేవైసీ ఆధార్ అనుసంధానం చేసుకోకపోతే రేషన్ కార్డులు రద్దు చేస్తామని చెప్పడం సరికాదన్నారు. రేషన్‌కార్డులు కలిగి ఉండేది కూలీలు, కార్మికులేనని వారంత ఇతర ప్రాంతాలకు వలసపోయి జీవిస్తున్నారన్నారు. ఈకేవైసీ ఆధార్ అనుసంధానానికి సమయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇటీవల పెరుగుతున్న నిత్యావసర ధరలు తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు దుబాస్ రాములు, విఠల్ గౌడ్, నల్ల గంగాధర్, సునీల్ కుమార్, సాయిలు, నగేష్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.


కోటగిరిలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

ఆన్‌లైన్ వ్యాపారంతో ప్రజలకు కుచ్చుటోపీ



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు 1: ఆన్‌లైన్ పెట్టుబడి పెట్టి లాభాలను గడించ వచ్చని ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ మోసాలకు పాల్పడ్డ ముఠాను నిర్మల్ పోలీసులు గుట్టురట్టు చేసి నిందితులను పట్టుకున్నారు. ఆర్మూర్ ఎక్సైజ్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న గంగాధర్ నిందితుడిలో ఒకరు. క్రిప్టో కరెన్సీ, బిట్‌కాయిన్ పేరుతో ఆన్‌లైన్‌లో నిర్మల్, నిజామాబాద్ జిల్లాలోని పలువురిని పెట్టుబడిని పెట్టిస్తూ అధిక లాభాలు పొందవచ్చని ప్రజలకు దూరాశను కల్పించినట్టు తెలి సింది. దీంతో నిర్మల్‌లో పలువురు బాధితుల ఫిర్యాదు మేరకు అక్కడి పోలీసులు ఐదుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్ చేశారు. అలాగే నిజామాబాద్ జిల్లాలోని బిట్‌కాయిన్ బాధితుల వివరాలను సేకరిస్తున్నట్టు తెలిసింది.

● ఆరు నెలల్లో ప్రమోషన్ ఉండగా అరెస్టు

ఆర్మూర్‌లో ఎక్సైజ్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఎస్సై గంగాధర్ ఆరు నెలల్లో ప్రమోషన్ ఉండగా అరెస్టు కావడంతో పోలీసు అధికారులు అవక్కాయ్యారు. 2005 బ్యాచ్‌లో ఎక్సైజ్ ఎస్సైగా పోస్టింగ్ రావల్సిన ఆయనకు ఎంపీడీవోగా పోస్టుఇచ్చారు. అనంతరం డీపీవోగా విధులు నిర్వహించిన ఆయన రెండేళ్ల క్రితం సుప్రీంకోర్టు తీర్పుతో ఆర్మూర్ ఎక్సైజ్ ఎస్సైగా విధులను చేపట్టారు. ఎన్నోఉన్నత పదవులు అధిరోహిస్తారనుకుంటే ఆత్యాశకు పోయి అధిక లాభాలు గడించవచ్చని కటకటలపాలు కావడంతో పోలీసులు నివ్వెరపోయారు.

నిర్మల్,సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కొత్త కొత్త టెక్నాలజీతో ప్రజలకు ఆశ చూపించి మోసాలు చేస్తున్న ముఠాను ఆదివారం నిర్మల్ పోలీసులు అరెస్టు చేశారు. కష్టం లేకుండా డబ్బులు సంపాదించాలన్న దురాశతో కొంత మంది ముఠాగా ఏర్పడి ప్రభుత్వ ఉద్యోగాలు, వ్యాపారాలు చేసే వారితో పాటు మధ్య తరగతి వారిని బురిడీ కొట్టించి ఆన్‌లైన్ కాయిన్ వ్యాపారం పేరుతో మోసం చేసిన వారిని అదుపులోకి తీసుకున్నారు. నిర్మల్ జిల్లాలో కడెం నుంచి ప్రారంభించి అన్ని ప్రాంతాల ప్రజలను మోసాలు చేయడమే వీరు పనిగా పెట్టుకున్నారు. ప్రజల నుంచి పోలీసులకు అందిన సమాచారం మేరకు 'నిర్మల్ పోలీస్-మీ పోలీస్' కార్యక్రమంలో భాగంగా ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ జానకి షర్మిల సవాలుగా తీసుకున్నారు. అదనపు ఎస్పీ అవినాష్ కుమార్ నేతృత్వంలో ప్రత్యేక టీం ఏర్పాటు చేశారు. పోలీసు బృందాలు ఈ కేసులో నిర్మల్ ప్రాంతంలో ఈ వ్యాపారాన్ని విస్తరించడంలో కీలకంగా వ్యవహరించిన కడెం మండలం నవాబుపేట గ్రామానికి చెందిన సల్ల రాజ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా ఈ వ్యాపారానికి సంబంధించిన వివరాలు వెల్లడించడంతో పోలీసులు మరికొందరిని అరెస్టు చేశారు. ఈ కేసులో సాయి కిరణ్‌తో పాటు కడెం మండలం గంగాపూర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కండెల నరేష్, ఎక్సైజ్ ఎస్సై గంగాధర్, ఏఆర్ కానిస్టేబుల్ మహేష్‌లను అరెస్టు చేశారు. సల్ల రాజ్‌కుమార్ చెప్పి వివరాల ప్రకారం.. బిట్ కాయిన్స్ ఆన్‌లైన్ వ్యాపా రంలో పెట్టుబడి పెట్టండి... మీకు డాలర్ల రూపంలో వస్తాయి. లేకుం టే మాది పూచీకత్తు అంటూ... 500ల రోజులలో (ఏడాదిన్నర) 5 ను ంచి 10 రెట్లు పెంచుకునే అవకాశం ఉందని అమాయకులను నమ్మి స్తూ వ్యాపారంలోకి దింపారు. కనీస కొనుగోలు :50 డాలర్లు (5,000),గరిష్ట కొనుగోలు :10,000 డాలర్లు (10 లక్షలు), నాన్ వర్కింగ్ ఇన్కమ్ : స్టేకింగ్ బోనస్ రోజుకు 0.5 శాతం అంటే నెలకు 15 శాతం (500 రోజులు), వర్కింగ్ ఇన్కమ్ : రిఫరల్ బోనస్ 1 శాతం - 100 శాతం, లెవెల్ బోనస్ 1 - 50 లెవెల్స్ లీడర్ షిప్ బోనస్: 1 స్టార్ - 7 స్టార్ 10 సీఆర్, ఇది కంపెనీ కాదు. ఉద్యోగం కాదు. వ్యాపారం కాదు. పెట్టుబడి కాదు. మీరు ఎంత మందిని జాయిన్ చేయిస్తే మీకు అంత లాభాలు వస్తాయని భారీ ఆశలు చూపించి వారందరిని మభ్యపెట్టి ఈ వ్యాపారంలో చాలా మంది ఉద్యోగస్తుల్ని చిన్న, మధ్య తరగతి వారిచే పెట్టుబడి పెట్టించి మోసం చేస్తున్నారని ఎస్పీ వెల్లడించారు. కాగా ఈ వ్యాపారానికి ఎటువంటి గుర్తింపు లేదని, బాధితులపై ఈ పథకం ప్రభావం తీవ్రంగా ఉందని ఆమె చెప్పారు. అమాయకుల నుంచి వసూలు చేసిన సొమ్ము దుర్వినియోగం అవుతోందని అక్రమార్కులు చేసిన తప్పుడు వాగ్దానాలను నమ్మి అమాయకులు ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. ఇలాంటి వ్యాపారంలో ముందుగా జాయిన్ అయిన వారికి మాత్రమే ప్రయోజనం చేకూర్చేలా ఈ వ్యాపారం రూపొందించబడిందని వీరు మొదటగా ఒకరిని జాయిన్ చేయించిన తర్వాత ఇంకొకరితో ఒత్తిడి తీసువచ్చి మళ్లీ కొత్త వారిని జాయిన్ చేయిస్తారని తెలిపారు. ఇలాంటి వ్యాపారంలో పెట్టుబడులు పెట్టి కుటుంబాలను రోడ్డు పాలు చేసుకోవద్దని, ఇలాంటి వారు మళ్లీ ఎవరైనా వస్తే మాకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. ఈ కేసులో ప్రతిభ చూపిన ఏఎస్పీ అవినాష్ కుమార్, డీఎస్పీ గంగారెడ్డి, నిర్మల్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, నిర్మల్ రూరల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ఎస్సైలు సాయికృష్ణ, ఎం. రవి, రవీందర్, కానిస్టేబుల్ తిరుపతి, గణేష్, శౌకత్, సతీష్‌లను ఎస్పీ ప్రశంసించారు.

కాలనీలో పిచ్చిమొక్కల తొలగింపు

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబర్1: పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం కాలనీలో వేపుగా పెరిగిన పిచ్చిమొక్కలు తొలగింపజేశారు. ప్రతీ ఆదివారం 2గంటల పాటు అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కాలనీవాసులు స్వచ్ఛ కాలనీ సమాఖ్యకాలనీలో భాగంగా పెరిగిన పిచ్చిమొక్కలను, చెత్తచెదారాన్ని తొలగింపజేశారు. అలాగే మురికికాల్వలో ఉన్న చెత్తను తొలగించి శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్, ఆలయ కమిటీ అధ్యక్షుడు పుప్పాల శివరాజ్, కొక్కెర భూమన్న, ఎల్‌టి.కుమార్, గడ్డం శంకర్, ఎర్ర భూమయ్య, సాయన్న, గణేష్, సతీస్, జీవన్, తదితరులు పాల్గొన్నారు..

కాశీవిశ్వనాథ ఆలయం లో ప్రత్యేక పూజలు

డిచ్‌పల్లి,సెప్టెంబరు 1: మండల కేంద్రంలోని కాశీవిశ్వనాథ ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా స్వామి వారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రుద్రాభిషేకం, రుద్రహోమం, సాయంత్రం అమృతాభిషేకం, కల్యాణం, పల్లకి సేవ పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసద వితరన చేశారు.

క్రీడా పోటీలు వాయిదా

ముప్కాల్, సెప్టెంబర్1.: నేటి నుంచి జరగాల్సిన ఉమ్మడి బాల్కొండ మండల అంతర్ పాఠశాల క్రీడా పోటీలు భారీ వర్షాల కారణంగా వాయిదా వేసినట్టు ఎంఈవో బట్టు రాజేశ్వర్ తెలిపారు. మళ్ళీ తదుపరి తేదీ ప్రకటిస్తామని ఆయన తెలిపారు.

'ప్రజలు అప్రమత్తంగా ఉండాలి'

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబర్1: కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్ దేవి లావణ్య శ్రీనివాస్ అన్నారు. గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్ళాలని ఆమె సూచించారు. లోతట్టు ప్రాంతాలలో నివాసించే వారు మున్సిపల్‌లో ఏర్పాటు కంట్రోల్ రూంలో సమాచారం అందించాలని, శిథిలావస్థలో ఉన్న ఇళ్ళలో ప్రజలు నివాసించవద్దని ఆమె తెలిపారు. అధికారులు ఎప్పటికప్పుడు మున్సిపల్ పరిధిలో పర్యటించాలని సూచించారు.

'చంద్రబాబు అభివృద్ధికి మార్గదర్శకంగా నిలిచారు'

బోధన్‌రూరల్,సెప్టెంబర్1: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తొలిసారిగా సమాఖ్య ఆంధ్రలో సీఎంగా ప్రమాణ స్వీకారం చేసి 29సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బోధన్ పట్టణంలో తెలుగు దేశం పార్టీ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు దేశం పార్టీ నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు తెలుగు ప్రజల అభివృద్ధికి మార్గదర్శకంగా నిలిచారన్నారు. ప్రస్తుతం 4వ పర్యాయం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి సమకాలీన రాజకీయాలలో భారతదేశ రాజకీయ గమనికపై గుర్తింపు పొందారన్నారు. తన విశిష్టమైన పరిజ్ఞానం, నేర్పుతో దేశ రాజకీయాలలో తనదైన ముద్ర వేశారన్నారు. భారత దేశ అభివృద్ధిలో తన పాత్ర వహించాలని కోరారు.

నాగిరెడ్డిపేటలో కూలిన చెట్టు


ప్రధాన రహదారిపై కూలిన చెట్టు

నాగిరెడ్డిపేట, సెప్టెంబరు 1 : భారీ వర్షాలు కురుస్తున్నందున నాగిరెడ్డిపేట మండల కేంద్రం వద్ద ఆదివారం సాయంత్రం హైదరాబాద్-బోధన్ ప్రధాన రహదారిపైన భారీ మర్రిచెట్టు కూలిపోయింది. దీంతో సుమారు గంట వరకు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చెట్టురోడ్డుపైనే కూలిపోవడంతో ఇరువైపులా వాహనాలు, చెట్టు తొలగించే వరకు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. దీంతో ట్రాఫిక్‌జామ్ అయింది. ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్ పోచారం ప్రాజెక్టు సందర్శనకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ చెట్టు రోడ్డు పైన కూలి పోయి, ట్రాఫిక్ జామ్‌కావడంతో ఆయన వెంటనే స్పందించి జాతీ యరహదారి పనులు చేస్తున్న వారికి సమాచారమిచ్చి, హిటాచీ, జేసీ బీలను రప్పించి వెంటనే రోడ్డుపై అడ్డంగా ఉన్న చెట్టును తొలగిం పజేశారు. దీంతో ట్రాఫిక్ క్లియర్ అయింది.

నాగిరెడ్డిపేట తహసీల్దార్‌గా శ్రీనివాస్‌రావు

నాగిరెడ్డిపేట, సెప్టెంబరు 1 : నాగిరెడ్డిపేట తహసీల్దార్ శ్రీనివాస్‌రావు పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు నాగిరెడ్డిపేట తహసీల్దార్‌గా పని చేసిన లక్ష్మణ్ అవినీతి, అక్రమాలకు పాల్పడగా, అతన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ విచారణ జరిపి గురువారం సస్పెన్షన్ చేశారు. ఆయన స్థానంలో ఎల్లారెడ్డిలో డివిజనల్ అడ్మినిస్ట్రేషన్ అధికారిగా పనిచేస్తున్న శ్రీనివాస్‌రావుకు నాగిరెడ్డిపేట ఫుల్ ఇంచార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు అప్పగించడంతో ఆయన బాధ్యతలను చేపట్టారు.

ఎగువ మానేరులో మత్స్యకారుడి గల్లంతు



సంఘటనాస్థలానికి వచ్చిన ఎస్పీ, గల్లంతైన శివరాములు (ఫైల్)

మాచారెడ్డి, సెప్టెంబరు 1 : మాచారెడ్డి మండలం లచ్చపేట గ్రామ శివారులో గల ఎగువమానేరు ప్రాజెక్టులో గ్రామానికి చెందిన కైరంకొండ శివరాములు (55) అనే మత్స్యకారుడు గల్లంతైనట్లు ఎస్సై అనిల్ తెలిపారు. శివరాములు ఆదివారం ఉదయం మానేరు ప్రా జెక్టులో చేపలు పట్టేందుకు వెళ్లగా వరద ఉధృతికి నీటిలో మునిగి కనిపించకుండాపోయాడు. అతడు ఉపయోగించిన తెప్ప, వల ఒడ్డుకు చేరుకోవడంతో కుటుంబసభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో ఎస్సై అనిల్ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈ విషయాన్ని ఎస్పీ సింధూ శర్మకు తెలిపారు. దీంతో ఆదివారం సాయంత్రం ఎస్పీ అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. వరద ఉధృతి తగ్గిన తర్వాత సహాయ చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు.

ఎన్ఎస్‌యుఐ యువకుల ఆర్థిక సహాయం

భీమ్‌గల్, సెప్టెంబర్ 1 : భీమ్‌గల్ పట్టణానికి చెందిన జుబేదా అనే మహిళ గత రెండేళ్లుగా చెస్ట్ క్యాన్సర్‌తో బాధపడుతుండడంతో ఆదివారం ఎన్ఎస్‌యూఐ నాయకులు రూ.5,500 ఆర్థిక సహాయం అందజేశారు.. నిరుపేద కుటుంబానికి చెందిన బాధితురాలు చికిత్స కోసం ఎన్ఎస్‌యుఐ జిల్లా ఉపాధ్యక్షుడు సయ్యద్ రహమాన్, బోజారాజు, పుప్పాల విశాల్, సుంకరి సురేష్‌లు తక్షణ సహాయంగా రూ..5500 ఆర్థిక సహయం అందజేశారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ

బాన్సువాడ, సెప్టెంబరు 1 : పెళ్లిని నిరాకరించినందుకు నర్సును హత్య చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు బాన్సువాడ పట్టణ సీఐ కృష్ణ పేర్కొన్నారు. ఆదివారం బాన్సువాడ పోలీస్‌స్టేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ కృష్ణ మాట్లాడుతూ బాన్సువాడ పట్టణంలోని 7 హిల్స్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న మమతను నీరుడి ప్రశాంత్ అద్దెకు ఉంటున్న ఇంట్లో తమ కూతురు హత్యకు ప్రశాంత్ కారణమని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామని, మమత మూడేళ్ళుగా ప్రశాంత్ ప్రేమలో ఉందని ఆయన తెలిపారు. పెళ్ళి విషయంలో వీరి మధ్య తరచూ గొడవలు జరిగాయని, మా అమ్మ ఐదు రోజులు సెలవు పెట్టి రమ్మని ఒత్తిడి చేస్తుందని మమత చెప్పిందని విచారణలో ప్రశాంత్ తెలిపినట్లు సీఐ వెల్లడించారు. ప్రశాంత్ తన తల్లితో ప్రేమ విషయం చెప్పాడని మన కంటే వారిది ఎక్కువ కులమని, పెళ్ళి చేసుకుంటే మనను బతకనివ్వరు అని కుమారునితో తల్లి చెప్పినట్లు ఆయన తెలిపారు. దీంతో ప్రశాంత్ మమతకు తన చెల్లి పెళ్లి చేశాక మా తల్లిని ఒప్పించి పెళ్ళి చేసుకుందామని అప్పటి వరకు ఆగుదామని మమతకు చెప్పినట్లు తెలిపారు. ప్రశాంత్ వారి అమ్మ పెళ్ళికి ఒప్పుకోదని మమత మరింత ఒత్తిడి చేయడంతో మమతను ఎలాగైనా తప్పించాలని గత నెల 30న అద్దెకు ఇంట్లో ఉన్న మమత ఇంటికి వెనుక డోర్ నుంచి వెళ్లి చున్నీతో ఉరి వేసి హత్య చేసినట్లు ప్రశాంత్ ఒప్పుకున్నట్లు సీఐ తెలిపారు. ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని ప్రశాంత్ తన స్నేహితునికి కాల్ చేసి డాక్టర్‌ను తీసుకురమ్మని చెప్పడంతో స్నేహితుడు డాక్టర్ కోసం వెళ్లిన ఎవరూ రాకపోవడంతో ఇద్దరు కలిసి మమతను బయటకు తీసుకు వస్తున్న సమయంలో ఇంటి యజమాని చూసి ఏమైంది అని అడుగుతాడు. సొమ్మసిల్లి పడిపోయిందని ఆసుపత్రికి తీసుకుని వెళుతున్నామని చెప్పడంతో ముగ్గురు కలిసి ఆసుపత్రికి తీసుకుని వెళ్లినట్లు సీఐ తెలిపారు. అప్పటికే మృతి చెందింది అని వైద్యులు తెలపడంతో మమత బంధువులకు ప్రశాంత్ ఫోన్ చేసి ఉరి వేసుకుని మమత చనిపోయిందని తెలిపి ప్రశాంత్ అక్కడి నుంచి పారిపోవడం జరిగిందన్నారు. ప్రశాంత్‌పై హత్య కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్ళు తదితరులు ఉన్నారు.

'వేతనాలు రాక కుటుంబపోషణ భారం'

బోధన్‌రూరల్,సెప్టెంబరు 1: పెగడాపల్లి గ్రామంలోని ఆరోగ్య కేంద్రంలో ఎండీ.జమాలుద్దీన్ అనే వ్యక్తి అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రెండు సంవత్సరాలుగా వేతనాలు రావడం లేదని కుటుంబ పోషణ భారంగా మారిందని ఆదివారం విలేకరుల ముందు తన గోడును వెల్లబోసుకున్నాడు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న నిధులు మంజూరు కాకపోవడం వల్ల తనకు వేతనం రావడం లేదని చెబుతున్నారని ఆయన ఆరోపించారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి తనకు రావాల్సిన రెండు సంవత్సరాల వేతన బకాయిలు చెల్లించి తన కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన కోరారు.

ఎడపల్లిలో చెరువులను పరిశీలించిన అధికారులు.

ఎడపల్లి, సెప్టెంబర్01: శనివారం నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండల కేంద్రంలో ఉన్న చెరువులను ఆదివారం ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్ అధికారులు సంయుక్తంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ ఏఈ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ రైల్ ఎఫెక్టెడ్ ట్యాంక్ చెరువులు పెద్ద చెరువు, అడి చెరువులలో నీరు రైల్ పట్టాలకు చేరువగా ఉన్నాయా అని పరిశీలించడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఉన్న చెరువులలో నీరు రైల్ ఎఫెక్టెడ్‌కు చేరువగా లేవని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట ఎడపల్లి తహసీల్దార్ ధన్వాల్, మండల పరిషత్ అధికారి మన్ మోహన్ శర్మ, ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన సునీల్‌కుమార్

వేల్పూర్, సెప్టెంబర్1: వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ గ్రామంలో కాంగ్రెస్ నాయకుడు బుల్లెట్ రమేష్ వారి అన్న ఇటీవల అనారోగ్యంతో మర ణించారు. ఈ విషయం తెలుసుకున్న బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ ముత్యాల సునీల్‌కుమార్ ఆదివారం వారి ఇంటికి వెళ్ళి కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట మండల కాంగ్రెస్, గ్రామ శాఖ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

'గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి'

బోధన్‌రూరల్,సెప్టెంబర్1: బోధన్ నియోజకవర్గంలో ప్రజలు గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి అన్నారు. ఆదివారం బోధన్‌లో ఎంపీఆర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న గణేష్ ఉత్సవాలను హిందు బంధువులు, యువత నియమ నిష్టాలతో ఘనంగా నిర్వహించుకోవాలన్నారు. శాంతియుతంగా హిందు బంధువులు గణేష్ పండుగను భక్తిశ్రద్ధల మధ్య నడుపుకోవాలన్నారు. గణేష్ మండపాలకు తనవంతు సహయ, సహకారాలు అందిస్తామన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కోటగిరి,సెప్టెంబర్1: కోటగిరి ఉమ్మడి మండలంలోని ఐదుగురు లబ్దిదారులకు ఆదివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను రాష్ట్ర వ్యవసాయశాఖ సలహాదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డి పంపిణీ చేశారు. పొతంగల్ గ్రామానికి చెందిన చంద్రకళ, అస్గరి బేగం, సుమలత, హంగర్గ ఫారంకు చెందిన కరీస్మా, దిలీప్‌లకు సీఎంఆర్ఎఫ్ కింద 3లక్షల రూపాయల చెక్కులు మంజూరు కాగా తన నివాసంలో బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు శంకర్ పటేల్, హెగ్డోలి శంకర్, నాయకులు ఏజాజ్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

'బాధితులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి'

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబర్ 1 : బోధన్ డివిజన్‌లో అక్బర్‌నగర్‌లో గల అగ్రికల్చర్ పాల్‌టెక్నిక్ కళాశాలలో అనుమానస్పద స్థితిలో మృతి చెందిన విద్యార్థిని రక్షిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని పీడీఎస్‌యు డివిజన్ అధ్యక్షుడు ప్రిన్స్ అన్నారు. ఆదివారం పట్టణంలో పీడీఎస్‌యు కార్యాలయంలో ఆయన ఏర్పాటు చేసిన సమావేశంలో మాటాడుతూ శనివారం కళాశాలలోని హాస్టల్, బాత్‌రూంలో విద్యార్థిని రక్షిత మృతి పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, అదే రోజు సీసీ కెమెరాలు పని చేయకపోవడం, కుటుంబసభ్యులు రాక ముందే మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించడం ఏంటని ప్రశ్నించారు. విద్యార్థిని మృతి వెనుకల ఎవరు ఉన్న ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని, విద్యార్థిని కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యు నాయకులు వెంకటేష్, భరత్, తదితరులు పాల్గొన్నారు.

అధిక వర్షాలతో జాగ్రత్తగా ఉండాలి

మెండోర, సెప్టెంబర్1: రాబోయే రెండు, మూడు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని మండల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, ఎస్సై నారాయణ ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా మండల ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని అత్యవసరం అయితే తప్ప ప్రయాణాలు చేయవద్దని, లోతట్టు ప్రాంతాల్లో ఉంటే ప్రజలకు కావల్సిన ఏర్పాట్లను సంబంధిత అధికారులు పర్యవేక్షిస్తారని తెలిపారు.

కమ్మర్‌పల్లి ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు1: కమ్మర్‌పల్లి మండల ఆర్యవైశ్య సంఘం నూతన పాలకవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా దొంతుల రమణయ్యగుప్త, ఉపాధ్యక్షుడుగా బెజగం వెంకటేష్‌గుప్త, కార్యదర్శిగా జొన్నల భూషన్ గుప్త, కోశాధికారిగా కటకం భాస్కర్ గుప్త, సలహాదారులుగా సీనియర్ సభ్యులు చిటికేశి గంగాధర్, మర్యాల నాగభూషణం, అమెడ నరేందర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

జిల్లా అంతటా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలు


మోపాల్‌లో రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు


బోధన్‌లో నిండుకుండలా మారిన పాండు చెరువు


ఆర్మూర్‌లో ఈదురుగాలులకు పాఠశాల వద్ద నేలకొరిగిన చెట్టు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 1: నగరంలో భారీ వర్షాలు ఉన్న నేపథ్యంలో నగర పాలక సంస్థ అధికారులు అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ మంద మకరంద్ ఆదేశించారు. ఆదివారం నగర పాలక సంస్థ అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తున్నారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. అధికారులు ఫోన్‌లో అందుబాటులో ఉండాలని ఎప్పటికప్పుడు కాలనీలలో ప్రజలతో సమస్యలను తెలుసుకుంటూ సమస్యలు పరిష్కరించే విధంగా చూడాలన్నారు. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రపర్చాలన్నారు. అధికారులు పనుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని చెప్పారు.

సిరికొండ: తుఫాను ప్రభావం వల్ల శనివారం రాత్రి నుండి ఎడతెరిపి లేకుండ కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని ప్రధాన వాగులన్నీ పొంగి ప్రవహిస్తున్నాయి. వరద ప్రభావం వల్ల వాగుల ప్రక్కనున్న పంట పొలాలు బాగా దెబ్బతిన్నాయి. ఇసుక మేట పెట్టింది. మండలంలోని దూప్య తండా గ్రామ పంచాయతీ పరిధిలో గల చోడ్‌తుంగ ఊట చెరువు తెగిపోయి పంట పొలాలు దెబ్బతిన్నాయి. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి మండలంలో ఇళ్లు కూలిపోయాయి. సిరికొండ,న్యావనందిలో ఒకరి ఇల్లు కూలిపోయినట్లు స్థానికులు తెలిపారు. సిరికొండ సమీపాన గల దోన్లవాగు వంతెన పై నుండి ప్రవహించడం,నార్సింగ్‌పల్లి వద్ద గల వాగు వంతెనపై నుండి ప్రవహించడం వల్ల సిరికొండ-భీమ్‌గల్ మధ్య రాకపోకలు స్తంభించాయి. కొండూర్ పాఠశాల వద్ద గల ఒర్రెలో అధికంగా వరద నీళ్లు రావడంతో అటువైపు ఎవరు వెళ్లలేని పరిస్థితి ఏర్పడ్డది.

ఇందల్వాయి: శనివారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో ఇందల్వాయి మండలంలోని వివిధ గ్రామాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి సరైనా వర్షాలు లేక బోసిపోయిన చెరువులు రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో జలకలను సంతరించుకున్నాయి. సిర్నాపల్లి, చంద్రయాన్‌పల్లి, ఇందల్వాయి, నల్లవెల్లి తదితర గ్రామాల్లో చెరువులు నిండి అలుగులు పారుతున్నాయి. వాగుల వద్దకు వెళ్ల వద్దని ఎస్సై మనోజ్‌కుమార్ పిలుపునిచ్చారు.

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలో శనివారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుంది. దీంతో పట్టణంలోని పలు కాలనీల్లో డ్రైనేజీలు ముసుకుపోయి రోడ్లన్నీ జలమయం అయ్యాయి. పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాల వద్ద కురుస్తున్న వర్షాలకు, ఈదురుగాలులకు చెట్టు నేలకొరిగింది. అలాగే ప్రధానరహదారుల గుండా ఉన్న డ్రైనేజీలలో చెత్తాచెదరం చేరి రోడ్లపైనీరు నిలిచిపోయింది. దీంతో మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ రాజు ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు,నేలకొరిగిన చెట్టును తొలగించి ప్రజలకు ఏలాంటి అంతరాయం కలుగ కుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు.

భీమ్‌గల్‌రూరల్: భీమ్‌గల్ మండలంలోని మెండోర, పల్లికొండ గ్రామాలలో ఆదివారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ పర్యటించారు.శనివారం రాత్రి నుంచి మండలంలో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నండడంతో అప్రమత్తంగా ఉండాలని ఆయన తెలిపారు.

భీమ్‌గల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల భీమ్‌గల్‌లో శనివారం సాయంత్రం నుంచి కురుస్తున్న వర్షం 56మిల్లీమీటర్లుగా నమోదైనట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఎడతెరిపి లేకుండా వర్షం పట్టణ కేంద్రంలో పాటు పలు కాలనీలు జలమయమయ్యాయి. పట్టణ కేంద్రానికి అనుకొని ఉన్న కప్పాలవాగు, చెక్‌డ్యాంలు ఉధృతంగా ప్రవహిస్తుంది.

బోధన్‌రూరల్: బోధన్‌లో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రహదారులన్ని వర్షపు నీటితో పొంగిపొర్లుతున్నాయి. రోడ్ల పై వరద నీరు నిల్వడంతో డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. శర్బత్ కెనాల్ వద్ద వర్షపు నీరు రోడ్డుపై ప్రవహించింది. బోధన్‌లోని బెల్లాల్ చెరువు అలుగు పారింది. పాండుతర్వా చెరువు పూర్తిగా నిండిపోయి నిండుకుండలా మారింది. భారీ వర్షాలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాలనీలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా అధికారులు చర్యలు చేపట్టారు. బోధన్ మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు, సంబంధిత వార్డులను పరిశీలించారు. వార్డులలో ప్రజలు వర్షపు నీటితో ఇబ్బందులు పడకుండా మున్సిపల్ సిబ్బందితో అప్పటికప్పుడు చర్యలు చేపట్టారు. పట్టణ సమీపంలో బెల్లాల్ ప్రాంతంలో నివాసం ఉంటున్న వికలాంగ తల్లికూతుళ్ల వర్షపు నీటితో ఇబ్బందులు పడుతున్నారని సమాచారం తెలుసుకుని తహసీల్దార్ విఠల్ బెల్లాల్ గ్రామపంచాయతీకి తరలించి పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు.

ముప్కాల్: బాల్కొండ, ముప్కాల్ మండలాల్లో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగిపోర్లుతున్నాయి. పంట పొలాల్లో భారీగా నీరు నిలిచిపోయింది. ఆయా గ్రామాల్లో చెరువులు నిండి అలుగులు పారుతున్నాయి. బోదేపల్లి, చిట్టాపూర్ గ్రామాల మధ్యలో అలుగు ఉధృతి పెరగడంతో రాకపోకలు నిలిపివేశారు.గ్రామాల్లో శిథిలావస్థలో ఉన్న ఇళ్లవారి కోసం గ్రామపంచాయతీల్లో,పాఠశాలలకు తరలించి వారిని పునరావాసం కల్పించాలని అన్నారు. మండలంలో కంట్రోల్‌రూం ఏర్పాటు చేయనున్నట్టు అధికారులు తెలిపారు.

కమ్మర్‌పల్లి:గత రెండు రోజులుగా కమ్మర్‌పల్లి మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు చెరువులు పొంగిపొర్లుతుండగా రహదారులు జల దిగ్బంధంలో ఉన్నాయి.గత రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు మండలంలో ఆరున్నర సెంటిమీటర్ల వర్షపాతం నమోదుకాగా ఉదయం నుంచి రాత్రి వరకుల వర్షం ఎడతెరపిలేకుండా కురుస్తునే ఉంది.మండంలోనే అతి పెద్ద చెరువుగా పిలువడే బషీరాబాబాద్ కాడిచెరువు ఉధృతంగా అలుగు పారుతు సమీపంలోని పంటపొలాలు నీట మునిగాయి. కాగా మండంలోని కోనాపూర్ రాళ్లవాగు ఉధృతంగా మత్తడి దూకుతుండడంతో ఎవరిని అక్కడికి అనుమతించడంలేదు. కాగా ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా సంప్రదించాలని తహసీల్దార్, ఎంపీడీవో ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మోర్తాడ్: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీవర్షాల వల్ల వాగులు పొంగిపోర్లుతున్నాయి. మోర్తాడ్‌కు చెందిన ముసలమ్మ చెరువు భారీ వర్షాల వల్ల నిండిపోయి అలుగుపారుతుంది. అంతేగాక కుంటలు కూడా నిండిపోయాయి.గాండ్లపేట్ శివారులోని పెద్దవాగుఉధృతంగా ప్రవహిస్తుంది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ సత్యనారాయణ, ఎస్సైవిక్రం, సీఐ నవీన్‌లు మండలంలోని ధర్మోరా, పాలెం గ్రామాల మధ్య గల పెద్ద వాగును పరిశీలించారు.

వర్ని: భారీ వర్షాల కారణంగా ఆదివారం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అన్ని గ్రామాల్లో వర్షాల కారణంగా చెరువులు, కుంటలు నిండి జలకళను సంతరించుకున్నాయి. అటవీ ప్రాంతం వరద కారణంగా జలాల్‌పూర్ చెరువుకు నీటి ఉధృతి పెరిగింది. దీంతో అప్రమత్తం అయిన ఎస్ఐ కృష్ణ కుమార్, ఎంపీడీవో, సిబ్బందితో వెళ్లి ముందస్తు చర్యలు చేపట్టారు.

జక్రాన్‌పల్లి:గ్రామాల్లో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. మండలంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం మధ్యాహ్నం 10సెంటమీటర్ల వర్షం కురిసినట్టు ఆర్ఐ తెలిపారు.

కోటగిరి: కోటగిరి ఉమ్మడి మండలంలో ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. శనివారం రాత్రి నుంచి ఆదివారం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురియడంతో చెరువులు, వాగులు జలకళను సంతరించుకున్నాయి. ప్రజలు ఇంట్లో నుంచి బయటకు రాలేని పరిస్థితి తలెత్తింది.కొల్లూర్, దోమలెడ్గి గ్రామాల మధ్య వాగు వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డుపై వరద నీరు ప్రవాహిస్తుండడంతో ట్రాక్టర్‌ను అడ్డుపెట్టారు.

రుద్రూరు: రుద్రూరు మండలంలోని బొప్పాపూర్ వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రుద్రూరు - బొప్పాపూర్ రహదారిపై వాగునీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న నేపథ్యంలో ఆదివారం రెవెన్యూ అధికారులు, పోలీసులురుద్రూరు- బొప్పాపూర్ బ్రిడ్జిపై రాకపోకలను నిలిపివేశారు.ఈసందర్భంగా ఆర్ఐ ఎస్సై సాయన్నలు మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ధర్పల్లి: మండలంలో గత శనివారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షానికి వాగులు, చెరువులు, కుంటలు పొంగిపొర్లుతున్నాయి. మండలంలోని రామడుగు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకుంది. శనివారం సాయంత్రానికి 1278.300 అడుగులకు చేరుకుంది. ప్రాజెక్టులోకి 15,485 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతున్నట్లు అధికారులు తెలిపారు.

మోపాల్: మండలంలో ఎడపతెరపి లేకుండా శనివారం రాత్రి నుంచి వర్షం పడుతూనే ఉంది. మండలంలోని ప్రధాన చెరువులన్నీ వర్షపునీటితో కలకలలాడుతున్నాయి.నిజామాబాద్‌నగరానికి తాగునీరు అందించే మంచిప్ప చెరువు అలుగు పారుతుంది.అధికారులు అప్రమత్తమై చెరువులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. మంచిప్ప, మాసాని చెరువులు వర్షపునీరు భారీగా వచ్చి చేరడంతో అలుగు పారుతుంది.

వేల్పూర్: గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల మండలంలోని పెద్దవాగు, కప్పలవాగులో నిండుగా నీరు ప్రవహిస్తుంది. మండలంలోని పలు గ్రామాల చెరువులు అలుగులు పారుతున్నాయి. చెరువు కాల్వలు, కుంటలు, వాగులు నిండుకుండల నిండి పొంగిప్రవహిస్తున్నాయి.

డిచ్‌పల్లి: బంగాళఖాతంలో ఏర్పాడిన అల్పపీడన ద్రోణితో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు డిచ్‌పల్లి మండలంలో అన్ని గ్రామాల్లో జనజీవనం పూర్తిగా స్తంభించింది. బర్ధిపూర్‌లో శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో ఉంటున్న కుటుంబాలను ఎంపీవో శ్రీనివాస్ గౌడ్, పంచాయతీ కార్యదర్శులు బాధిత కుటుంబాలను పునరవాస కేంద్రాలు ప్రభుత్వ పాఠశాలలకు తరలించారు.నిజామాబాద్-డిచ్‌పల్లి ప్రధాన రోడ్డుపై భారీగా వరద ప్రవహం ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు.గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రామడుగు ప్రాజెక్టులోని వరద నీరు వచ్చి చేరుతుంది. దీంతో ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

● అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పారుతున్న వాగులు, ప్రజలకుజరిగే అంతరాయలపై వివరాలను అధికారులను ఎప్పటికప్పుడు ఎమ్మె ల్యే భూపతిరెడ్డి ఫోన్‌లో అడిగి తెలుసుకున్నారు. అధికారులంత వర్షాలు తగ్గే వరకు గ్రామాల్లో ఉండి సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా, ప్రమాదాలు జరగకుండా సూచనలు ఇవ్వాలని ఆదేశించారు.

ఏర్గట్ల: గోదావరి తీర ప్రాంతలైన తడపాకల్, గుమ్మిర్యాల్, దోంచంద గ్రామాలకు చెందిన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ శాఖతో పాటు రెవెన్యూ అధికారులు ప్రజలకు సూచించారు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి తీర ప్రాంతాలను ఎస్సై రాము రెవెన్యూ అధికారులతో కలసి పరిశీలించారు.

రెంజల్: కురుస్తున్న భారీ వర్షాలకు కందకుర్తి గోదారమ్మ పరవళ్లు తొక్కుతుంది. స్థానికంగా కురవమే కాక ఎగువ ప్రాంతం అయిన మహరాష్ట్రలోని విష్ణుపురి, బాబ్లీప్రాజెక్టు గేట్లు తెరవడంతో వరద నీరు కందకుర్తి త్రివేణి సంగమ క్షేత్రానికి తరలిరావడంతో కందకుర్తిలోని హరిద్ర, మంజీర, గోదావరి నదుల త్రివేణి సంగమం క్షేత్రం వద్ద నీటి తీవ్రత అధికంగా కనిపిస్తుంది. ఆదివారం కందకుర్తి బ్రిడ్జిని అనుకుని నీరు ప్రవాహించడంతో పుష్కరఘాట్, పురాతన శివాలయం వరకు అధికంగా నీరు చేరి నీటి ప్రవాహం కొనసాగుతుంది. ఇక్కడి నీటి ప్రవాహన్ని స్థానిక తహసీల్దార్ ఎస్ఐ సాయన్నలు పర్యవేక్షించారు.


కందకుర్తి వరద నీటిలో మునిగిన శివాలయం


నిజామాబాద్-డిచ్‌పల్లి ప్రధాన రోడ్డుపై నిలిచిన వరద నీరు


కోనాపూర్-ఆత్మకూర్లకు మధ్య రాకపోకలు లేకుండా రోడ్డుకు అడ్డంగా ట్రాక్టర్


జలాల్‌పూర్ చెరువును పరిశీలిస్తున్న ఎస్ఐ, ఎంపీడీవో


కలిగోట్, చింతలూర్ చెక్‌డ్యాంల నుంచి నిండుగా పారుతున్న వరద నీరు


మోతె వద్ద నిండుగా ప్రవహిస్తున్న కప్పలవాగు


ఎడపల్లి చెరువును పరిశీలిస్తున్న అధికారులు


అర్గుల్‌లో పారుతున్న పల్‌చెరువు అలుగు


రుద్రూరు - బొప్పాపూర్ బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తున్న నీరు

ఆల్ ఇండియా జోనల్ హాకీ క్రీడల పోటీలకు ఎంపికైన తూంపల్లి విద్యార్థులు

సిరికొండ సెప్టెంబరు 1 : జార్ఖండ్ రాష్ట్రంలో ఈ నెలలో జరుగనున్న ఆల్ ఇండియా జోనల్ హాకీ క్రీడల పోటీలకు సిరికొండ మండలం తూంపపల్లి హైస్కూల్‌కు చెందిన మనోజ్, అక్షయ మెన్, ఉమెన్ జట్లకు ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్.నగేష్ తెలిపారు. రాంచీ పట్టణంలో ఆదివారం నుంచి సెప్టెంబరు 3 వరకు జరుగుతున్న హాకీ క్రీడల పోటీలలో అగ్గు మనోజ్, కంచర్ల అక్షయ సౌత్‌జోన్ మెన్, ఉమేన్ జట్లకు ప్రాతినిధ్యం వహిస్తున్నారని ఆయన తెలిపారు. జూలై నెలలో 10 నుంచి 17 వరకు కడప జిల్లాలో జరిగిన సౌత్ జోన్ హాకీ క్రీడల మెన్ మరియు ఉమెన్ పోటీలలో క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించినందున జాతీయ సెలెక్షన్ పోటీలకు అగ్గు మనోజ్, కంచర్ల అక్షయ ఎంపికయ్యారని ఆయన తెలిపారు. జూలై 13 నుంచి 24 వరకు జరిగిన శిక్షణ శిబిరంలో మంచి ప్రతిభను ప్రదర్శించడం వల్ల సౌత్ జోన్ జట్టుకు ఎంపికయ్యారని నగేష్ తెలిపారు.మారుమూల గ్రామమైన తూంపల్లికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఆల్ ఇండియా టోర్నీకి ఎంపిక కావడం పట్ల గ్రామస్థులు, యువకులు, పెద్దలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా హాకీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వేల్పూర్ గంగారెడ్డి, రమణ మనోజ్, అక్షయ ఈ టోర్నీలో క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి జాతీయ జట్టుకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు.ఇద్దరు క్రీడాకారులను అభినందించారు


అగ్గు మనోజ్, కంచర్ల అక్షయ

వర్నిలో దిమ్మెకూలి పడిన ట్రాన్స్‌ఫార్మర్

వర్ని,సెప్టెంబర్1:భారీవర్షాల కారణంగా ఆదివారం త్రుటిలో పెను ప్రమాదం తప్పింది.వర్ని మండల కేంద్రంలోని బస్టాండ్ మార్గంలోగల 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్ హఠాత్తుగా దిమ్మెకూలి కింద పడడంతో మంటలు చెలరేగాయి. ఆ సమయంలో వర్షం కురువగా మీసేవా కేంద్రం మూసిఉంది. పలు డిపోలకు చెందిన బస్సులు రాకపోకలు లేకపోవడంతో అదృష్టవశాత్తు ఎలాంటి ప్రమాదం జరుగలేదు.మీసేవానిర్వాహకుడు సమాచారంతో విద్యుత్ శాఖ సిబ్బంది అప్రమత్తమై విద్యుత్ సరఫరాన నిలిపివేశారు. వెంటనే లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీరామ్,లైన్‌మెన్ రవీందర్ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు.

● త్రుటిలో తప్పిన ప్రమాదం


కిందపడ్డ ట్రాన్స్‌ఫార్మర్

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని వినతి

నవీపేట,సెప్టెంబర్1:మండలంలోని బినోల సొసైటీ పరిధిలోని అర్హులైన రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ వర్తించే విధంగా చూడాలని కోరుతూ సొసైటీ పాలకవర్గం సభ్యులు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు.ఆదివారం నిజామాబాద్‌లోని ఆయన స్వగృహంలో ఎమ్మెల్యేను కలిశారు. బినోల సొసైటీలో రుణమాఫీకి 1030మంది అర్హులైన రైతులు ఉండగా ఇప్పటి వరకు 600మంది రైతులకు రుణమాఫీ వర్తించిందని మిగిలిన 430మంది రైతులకు సాంకేతిక కారణాలతో రుణమాఫీ వర్తించలేదని అన్నారు. అలాగే 22సంవత్సరాల క్రితం మండలంలోని మోకన్‌పల్లి సొసైటీలో బినోల సొసైటీలో కలపడం జరిగిందని, దీని ద్వారా మోకన్‌పల్లి సొసైటీ పరిధిలోని గ్రామాల రైతులు బినోలకు రావడం కష్టంగా మారిందని అన్నారు. వెంటనే మోకన్‌పల్లి సొసైటీని తిరిగి బినోల సొసైటీ నుండి వీడదీయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బినోల సొసైటీ చైర్మన్ హన్మాండ్లు,పాలకవర్గం సభ్యులు ఉన్నారు.


సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

రేషన్ బియ్యం కొనుగోలుదారులపై
కఠిన చర్యలు తీసుకోవాలి : పుప్పాల రవి

మోర్తాడ్, సెప్టెంబర్1.: కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం ప్రధాన మంత్రి గరిబ్ కళ్యాణ్ అన్నయోజన పథకం కింద ఉచిత బియ్యాన్ని పథకాన్ని పక్కతోవ పటిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కఠిన చర్యలు తీసుకోవాలని మండల బీజేపీ అధ్య క్షుడు పుప్పాల రవి కోరారు. కేంద్రం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని కొందరు దళారులు మోర్తాడ్ ను అడ్డగా చేసుకొని రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తు న్నారని ఆరో పించారు. ప్రజల నుంచి రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్న వారిపై సివిల్‌సప్లయ్, రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం శోచనీయ మని అన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. అధికారులు రేషన్ బియ్యం కొనుగలుదారులపై చర్య లు తీసుకో కుంటే జిల్లా స్థాయి అధి కారుల దృష్టికి తీసుకువెళ్తామని ఆయన అన్నారు.

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.85	రూ.200	రూ.220
వెన్‌కాబ్(కిలో)	రూ.95	రూ.205	రూ.225

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.74200	రూ.68,450	రూ.890

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : తంగలాన్ (11.50)
: సరిపోదా శనివారం (3.10, 6.45, 10.20)
స్క్రీన్-2 : స్త్రీ-2 (హిందీ) (12.15, 3.30, 6.45)
: గబ్బర్‌సింగ్ (10.00)
స్క్రీన్-3 : కాలం రాసిన కథలు (10.15)
: కమిటీ కుర్రాళ్లు (1.10)
: నేను కీర్తన (4.25)
: ఆయ్ మేం ఫ్రెండ్స్ అండి (7.40)
: స్త్రీ-2 (హిందీ) (10.45)
స్క్రీన్-4 : సీతారాం సిత్రాలు (9.40)
: సరిపోదా శనివారం (12.30)
: తంగలాన్ (4.05)
: డిమోంటి కాలనీ-2 (7.25, 10.35)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : సరిపోదా శనివారం (1.00, 4.10, 7.20, 10.30)
స్క్రీన్-2 : గబ్బర్‌సింగ్ (10.30, 1.30, 4.30, 7.30, 10.30)



దేవి : తంగలాన్ (11.15, 2.15, 6.15)
: గబ్బర్‌సింగ్ (9.15)
నటరాజ్ : గబ్బర్‌సింగ్ (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : గబ్బర్‌సింగ్ (11.15, 2.15, 6.15)
: మిస్టర్ బచ్చన్ (9.15)
లలితామహల్: సరిపోదా శనివారం (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్